www.aksharavelugu.com

# అక్షర వెలుగు

తెలుగు దిన పత్రిక

TELTEL02057

శుక్ర వారం
18.11.22

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : పృధ్విరాజు. జి | సంపుటి - 01, సంచిక-116 | పేజీలు - 4 | వెల రూ. 5

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak




# పాడైన రోడ్లకు ఎప్పటికప్పుడు మరమ్మత్తులు

## గ్రామీణ రోడ్లను వెంటనే సరిచేసేలా చర్యలు

- రోడ్డు ప్రమాదాల నివారణకు ఇదే సరైన చర్య
- వచ్చే జనవరి నుంచి మళ్లీ కంటివెలుగు కార్యక్రమం
- ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షలో కెసిఆర్ నిర్ణయం
- సచివాలయ నిర్మాణ పనులను పరిశీలించిన కెసిఆర్



**హైదరాబాద్, నవంబర్ 17 (అక్షర వెలుగు):** తెలంగాణలో పాడైన రోడ్లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని సిఎం కేసీఆర్ సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోని రోడ్ల పరిస్థితిపై ఆయన గురువారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పరిపాలన సంస్కరణలో భాగంగా.. వికేంద్రీకరణ, పనుల నాణ్యత పెంచే దిశగా రోడ్లు, భవనాల శాఖలో చేపట్టాల్సిన నియామకాలపై చర్చించారు. రోడ్లు ఎప్పటికీ చెక్కుచెదరకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆయన చెప్పారు. మారుమూల గ్రామాల్లో కూడా రోడ్ల పరిస్థితిపై దృష్టి పెట్టాలని చెప్పారు. పాడైన రోడ్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయడం వల్ల... రోడ్డు ప్రమాదాలను కూడా నివారించవచ్చని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. అలాగే పలు ఇతర అంశాలపై సీఎం చర్చించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖల మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. సమీక్ష సమావేశంలో మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బాల్క సుమన్, పైలట్ రోహిత్ రెడ్డి, దానం నాగేందర్, మైనంపల్లి హన్మంతరావు, సీఎస్ సోమేశ్ కుమార్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగ్ రావు, సీఎం సెక్రటరీలు భూపాల్ రెడ్డి, స్మితా



3 లో



## బెంగాల్ పర్యటనలో కేంద్రమంత్రి గడ్కరీకి అస్వస్థత

- షుగర్ లెవల్స్ పడిపోవడంతో క్షీణించిన ఆరోగ్యం
- వెంటనే వైద్యం అందించి రెస్టూమ్‌కు తరలింపు
- ఆరా తీసిన ప్రధాని మోడీ,..సిఎం మమతా బెనర్జీ

**కోల్‌కతా, నవంబర్ 17 (అక్షర వెలుగు):** కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అస్వస్థతకు గురయ్యారు. బెంగాల్ పర్యటనలో ఉన్న సమయంలో ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యారు. సిలిగురిలో స్టేజ్‌పై ఉండగానే షుగర్ లెవల్ తగ్గినట్లుగా గుర్తించిన డాక్టర్లు వెంటనే గడ్కరీకి వైద్యం అందించారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం అస్వస్థతకు గురయ్యారు. ఒక కార్యక్రమంలో వేదికపై అకస్మాత్తుగా

3 లో

# నేనో రాష్ట్రానికి సిఎంను.. పారిపోయే వ్యక్తిని కాదు

- ఇడి తీరు వేధింపు తరహాలోనే సాగుతోంది
- అక్రమాలను భూతద్దంలో చూపేలా చేస్తున్నారు
- జెఎంఎం సర్కార్‌ను అస్థిరపరచే కుట్రలో బిజెపి
- ఇడి విచారణకు హాజరయ్యే ముందు హేమంత్ వ్యాఖ్యలు



**రాంచీ, నవంబర్ 17 (అక్షర వెలుగు):** తాను ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రినని, దేశాన్ని విడిచి పారి పోవడానికి వ్యాపారవేత్తను కానంటూ ఇడి సమన్లపై జార్ఖండ్ ముఖ్య మంత్రి హేమంత్ సోరెన్ మండిపడ్డారు. గురువారం ఇడి విచారణకు హాజరు కావడానికి ముందు రాంచీలోని తన నివాసంలో మద్దతుదారులనుద్దేశించి ప్రసంగించారు. తాను ముఖ్యమంత్రిగా రాజ్యాంగబద్ధమైన పదవిని కలిగి ఉన్నానని, అయితే విచారణ జరుగుతున్న తీరు, ఇడి సమన్లు పంపుతున్న తీరు చూస్తుంటే తాను దేశం విడిచిపారిపోయే వ్యక్తిలా వారు భావిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడా వ్యాపారవేత్తలు తప్ప నేతలెవరూ దేశం విడిచి వెళ్లిన సందర్భాలు లేవని, ఏ రాజకీయ నేత అలా పారిపోలేదని స్పష్టం చేశారు. జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) -కాంగ్రెస్‌ల సంకీర్ణ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న పెద్ద కుట్రలో ఇడి విచారణ ఓభాగమని అన్నారు. 2019 ఎన్నికల్లో జెఎంఎం- కాంగ్రెస్‌లు

3 లో



## బాలలకు శ్రీరామరక్ష శ్రీ సత్యసాయి సంజీవని కేంద్రం

బాలల గుండె చికిత్సలకు భరోసా ● మంత్రి హరీష్ రావు వెల్లడి

**సిద్దిపేట, నవంబర్ 17 (అక్షర వెలుగు):** సిద్దిపేట జిల్లాలోని కొండపాకలో శ్రీ సత్యసాయి సంజీవని బాలల గుండె చికిత్స, పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల మంత్రి హరీశ్ రావు ఆనందం వ్యక్తంచేశారు. దక్షిణ భారతదేశ ప్రజలకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు చేయడానికి ఈ సెంటర్‌ను నెలకొల్పడంతో తెలంగాణ ప్రత్యేకతను సాధించిందన్నారు. కొండపాకలో కొత్తగా నిర్మించిన శ్రీ సత్యసాయి సంజీవని బాలల గుండె చికిత్స, పరిశోధన కేంద్రాన్ని సద్గురు మధుసూదన్‌సాయితో కలిసి మంత్రి హరీశ్ రావు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నదని అన్నారు. అయినా ఇలాంటి సంస్థలతో మరింత బలోపేతం కానుందన్నారు. ప్రతి వందమంది చిన్నారుల్లో ఒకరు గుండె సంబంధిత వ్యాధితో మృత్యువాతపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని సద్గురు మధుసూదన్ సాయి గారిని కోరగానే సానుకూలంగా స్పందించారని, కొండపాకలో బాలల గుండె శస్త్ర చికిత్స కేంద్రాన్ని

3 లో

## యాదాద్రీశుడి సేవలో ప్రహ్లాద్ జోషి



**యాదగిరిగుట్ట, నవంబర్ 17 (అక్షర వెలుగు):** కేంద్ర బొగ్గు గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు

3 లో

## ట్రాన్స్‌కో ఉద్యోగులకు అన్యాయం జరిగితే సహించం

ప్రమోషన్లపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్వీట్



**హైదరాబాద్, నవంబర్ 17 (అక్షర వెలుగు):** ప్రమోషన్స్ లో తెలంగాణ ట్రాన్స్ కో ఉద్యోగులకు అన్యాయం జరిగితే సహించేది లేదని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ట్రాన్స్ కో యజమాన్యం దాదాపు 1300 మంది ఉద్యోగులను 7 సంవత్సరాల

3 లో

## ఐజ్వాల్‌లో ఇంటర్నేషనల్ టూరిజం మార్ట్

ఈశాన్య రాష్ట్రాల పర్యాటకం గురించి తెలిపే చర్య

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**ఐజ్వాల్, నవంబర్ 17 (అక్షర వెలుగు):** మిజోరాం రాజధాని ఐజ్వాల్‌లో ఇంటర్నేషనల్ టూరిజం మార్ట్‌ను నిర్వహిస్తున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల పర్యాటక సామర్థ్యం దేశానికి తెలియాల్సివుందని.. టూరిజం మార్కెట్‌ను ప్రోత్సహించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోడీ నాయకత్వంలో ఈశాన్య రాష్ట్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని చెప్పారు. మౌలిక వసతుల్లేకుండా

3 లో

## ఎమ్మెల్యేల కొనుగోలులో సిట్ విచారణ వేగవంతం

**హైదరాబాద్, నవంబర్ 17 (అక్షర వెలుగు):** ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సిట్ విచారణ వేగవంతమైంది. కేరళలో రెండు బృందాలతో సిట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. కొచ్చి, కొల్లంలో సిట్ తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ కేసులో కొత్తగా వెలుగులోకి వచ్చిన తుషార్ అనే వ్యక్తి కేరళ ఎన్డీఏ కన్వీనర్‌గా పనిచేసినట్టు గుర్తించారు. భారత ధర్మ జనసేన పార్టీ నేతగా అధ్యక్షుడు తుషార్ ఉన్నారు. బీజేపీ మద్దతుతో వాయనాడు నుంచి రాహుల్ గాంధీపై ఎన్డీఏ అభ్యర్థిగా పోటీ చేశాడు. నవంబర్ 21వ తేదీన విచారణకు రావాలని తుషార్‌కు సిట్ ఆదేశాలు జారీ చేసింది. రామచంద్ర భారతి, ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌తో తుషార్ మాట్లాడినట్టు తెలుస్తోంది. వీరికి గల సంబంధాలపై ఆరా తీస్తోంది.

# శబరిమల ఆలయం తెరుచుకోవడంతో భక్తుల రాక

- భారీగా తరలివచ్చిన అయ్యప్ప భక్తులు
- వర్షంతో పాటు, పొంగుతున్న పంబా నది
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరికలు



**కొట్టాయం, నవంబర్ 17 (అక్షర వెలుగు):** కేరళలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమల ఆలయం బుధవారం సాయంత్రం తెరుచుకుంది. దీంతో సాయంత్రం నుంచే భక్తులు క్యూ కట్టారు. గురువారం కూడా భారీ సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. వారి దర్శనాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. చాలాకాలం తరవాత శబరిమలలో అయ్యప్ప స్వాముల సందడి మొదలైంది. భారీ వర్షం మధ్య శబరిమల ఆలయంలో అయ్యప్ప స్వామి దర్శనాలు బుధవారం సాయంత్రం 5గంటల నుంచి ప్రారంభం అయ్యాయి. తంత్రి కందరరు

3 లో

## తెలంగాణలోనే అత్యధికంగా కరెంట్ ఛార్జీలు

- వచ్చిన పెన్షన్ కరెంట్ బిల్లులకే సరిపోవడం లేదు
- తండ్రిపై అలకతో కవిత కాంగ్రెస్‌లోకి పోయే యత్నాలు
- సొంత కుటుంబ సభ్యులతోనే కెసిఆర్ భ్రష్టుపట్టారు
- నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ ఆరోపణలు

3 లో

## ఆగని పెట్రోల్ బంక్ మోసాలు

రాజేంద్రనగర్ బంకులో చిప్ అమర్చి మోసం

**హైదరాబాద్, నవంబర్ 17 (అక్షర వెలుగు):** ఇంధన ధరలు భారీగా పెరిగాయని జనాలు గగ్గోలు పెడుతుంటే.. మరోవైపు పెట్రోల్ బంకుల మోసాలతో మరింత నష్టపోతున్నారు. పెట్రోల్ బంకుల మోసాలను కట్టడి చేసేందుకు అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. ఆ మోసాలు ఆగడం లేదు. రోజుకో కొత్త తరహాలో పెట్రోల్ మోసాలు వెలుగు చూస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో పెట్రోల్ బంకుల్లో మోసాల నియంత్రణకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నా.. మోసాలు మాత్రం ఆగడం లేదు. తాజాగా హైదరాబాద్

3 లో

**డోనాల్డ్ ట్రంప్‌కు కూతురు ఇవాంకా షాక్** — అధ్యక్ష ఎన్నికల్లో ప్రచారం చేయనని వెల్లడి — 2

**కొత్త బుల్లెట్‌ప్రూఫ్ వాహనం ఇవ్వండి** — పాది మొరాయిస్తోందని ఐజికి రాజాసింగ్ లేఖ — 2

**కొత్తగా 15 ఫైర్ స్టేషన్లు మంజూరు** — అవసరమైన 382 ఉద్యోగాలకు కూడా అనుమతి — 2

**స్కూల్,కాలేజీ విద్యార్థినులకు శానిటరీ కిట్స్** — బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా నిధులు విడుదల — రూ. 69.52 కోట్లతో అడలోసెంట్ హెల్త్ కిట్ల కొనుగోలు — ఉత్తర్వులు జారీచేసిన కెసిఆర్ ప్రభుత్వం — 2

**తెలంగాణలో కులవృత్తులకు ప్రోత్సాహం** — చెరువులో రొయ్యలను వదిలిన మంత్రి నిరంజన్ — 2

## సంపాదకీయం

### అస్పష్టంగా ప్రత్యామ్నాయ రాజకీయాలు !

భారత రాజకీయాల్లో ఎప్పుడు ఎవరు ఎదుగుతారో..ఎవరు వెనక్కి పోతారోచెప్పలేం. గత రాజకీయచరిత్రను చూస్తే ఇలాంటి అనేకానేక అసంభాలన్నీ సంభవమయ్యాయి. మోడీ దేశ రాజకీయాల్లో దూసుకుని వచ్చి బలమైన నేతగా నిలిచి పోతారని బహుశా ఎవరూ ఊహించి ఉండరు. అలాగే ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, తెలంగాణలో కెసిఆర్, ఎపిలో జగన్ ఇలా ప్రభుత్వాలను ఏర్పాటు చేసి ప్రాంతీయపార్టీల అధినేత లుగా నిలిచిపోతారని కూడా ఎవరూ భావించలేదు. అలాగే కెసిఆర్ జాతీయ రాజకీయాల్లోకి అడుగు పెట్ట బోతున్నారు. జాతీయ రాజకీయాల్లో ఎలాంటి ఆశ్చర్యకర పరిస్థితులను సృష్టించినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు. భారతదేశంలో పరిస్థితులకు అనుగుణంగా రాజకీయాలు మారుతున్నాయి. ప్రజలు కూడా ఒకే పార్టీకి అదేపనిగా అతుక్కుని ఉండడం లేదు. ఓటు బ్యాంక్ అన్నది ఇప్పుడు కల్ల. ఏ ఎన్నికల్లో ఎవరు ఎప్పుడు గెలుస్తున్నారో చెప్పలేం. ఎవరు ఎవరికి ఓటేస్తున్నారో కూడా చెప్పలేం. రాజకీయ నాయకుల విధానాలను బట్టి ప్రజలు కూడా తమ ఆలోచనలను మార్చుకుంటున్నారు. ఇటీవలి కాలంలో హిందూ ఎజెండాతో ముందుకు పోతున్న బిజెపికి ఆప్ గట్టి పోటీనే ఇస్తోంది. పంజాబ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు గుజరాత్‌లోనూ గట్టి పోటీని ఇస్తోంది. ఆప్ దూసుకుని రావడంతో పాటు ప్రజలకు ప్రత్యా మ్నాయ మార్గంగా కనిపిస్తోంది. ఎందుకంటే బిజెపికి పోటీగా ఆప్ కూడా మెల్లగా హిందుత్వ పోకడలను ఆకళింపు చేసుకుని వారి ఓట్లను కొల్లగొట్టే ప్రయత్నాల్లో ఉంది. నోట్లపై హిందూదేవుళ్ల ఫోటోలను ముద్రించాలన్న ఎజెండా వెనక ఇది దాగి వుంది. ఆప్ ఢిల్లీలో మంచి పాలనను చూపింది. అలాగే ఇప్పుడు పంజాబ్‌లోనూ పాగా వేయడంతో భవిష్యత్‌లో బిజెపికి ప్రత్యామ్నాయం అనే సంకేతాలు ఇస్తోంది. ఈ విజయంతో ఆ పార్టీకి జాతీయ హోదా కూడా దక్కింది. దీంతో ఇప్పుడు గుజరాత్‌పైనా గట్టిగానే పట్టు బిగిస్తోంది. దేశంలో భవిష్యత్ రాజకీయాలు బీజేపీ వర్సెస్ ఆప్‌గా మారతాయని చెప్పడానికి పంజాబ్ ఫలితం ఒక సంకేతం. ఈ క్రమంలో ఎవరు ఎక్కడ ఎలా గెలిచారన్నది కాకుండా ఎంత సమర్థ పాలనను, అవినీతి రహితంగా అందించారన్నదే ముఖ్యం. ఈ క్రమంలో కెసిఆర్ బిఆర్ఎస్ ప్రకటించినా విపక్ష పార్టీల నుంచి పెద్దగా స్పందన కానరావడం లేదు. అనేకంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు తమ అస్తిత్వాన్ని కోల్పోవ దానికి సిద్దంగా లేవు. అందుకే ఎవరికి వారు పోరాడుతున్నారు. విపక్షాల్లో అనైకత్యను బిజెపి బాగా ఉపయో గించుకుంటోంది. కాంగ్రెస్ బలహీనపడడం, బిజెపి బలపడడం, విపక్షాల్లో అనైక్యత అన్నది దేశంలో ప్రస్తుతం నడుస్తున్న చరిత్రగా ఉంది. ఇది మారుతుందా లేదా అన్నది 2024 ఎన్నికల నాటికి తేలనుంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి విపక్షాలు కలసి ఉమ్మడి ఎజెండాతో వస్తాన్న నమ్మకం లేదు. అలాగని ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాలకు కూడా విపక్షాలు సిద్దంగా లేవు. ఈ క్రమంలో ఆప్ కొంత విపక్ష బాధ్యత ను తీసుకున్నట్లుగా ఉంది. పంజాబ్‌లో మెల్లగా పాలనపై పట్టు బిగిస్తోంది. పంజాబ్‌లో ఇప్పుడు డ్రగ్స్ నిర్మూలన ఆప్ తక్షణ కర్తవ్యం కావాలి.. యువతకు ఉద్యోగ ఉపాధి చూపాల్సి ఉంది. వనరుల పరంగా పంజాబ్ బాగా ముందంజలో ఉంది. వీటిని ఉపయోగించుకుని ఆప్ ఓ మాడల్ పాలనకు శ్రీకారం చుట్టాలి. వ్యవసాయ రంగంలో బాగా పురోగమించిన పంజాబ్‌లో ఉపాధికి ఉన్న అవకాశాలను విరివిగా ఉపయోగిం చుకోగలగాలి. ఇకపోతే ఢిల్లీలో పాలనకు పంజాబ్‌లో పాలనకు తేడా ఉంది. ఉగ్రవాదాన్ని, డ్రగ్స్‌ను నిర్మూలించి, నిరుద్యోగులకు మంచి ఉపాధి అవకాశాలను కల్పించే దశగా ప్రణాళికా బద్దంగా కేజ్రీవాల్ అడుగులు వేయాలి. అది దేశానికి ఓ మార్గదర్శిగా నిలిచేలా చూపాలి. ఆ మోడల్ ద్వారా దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయాలకు ఆప్ వేదిక కాగలదు. ప్రస్తుత గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో అరవింద్ కేజీవ్రాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కీలకంగా ఎదగింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలి. ప్రాంతీయ పార్టీల్లో ఇప్పుడున్న నేతలకన్నా కేజ్రీవాల్‌కే ఎక్కువ ఆదరణ ఉందని తాజా ఎన్నికల ఫలితాలను బట్టి తేలింది. అవినీతి నిర్మూలనను తమ ప్రధాన ఎజెండాగా రాజకీయాల్లోకి వచ్చిన కేజీవ్రాల్ తన లక్ష్యం మేరకు పనిచేసే సంకల్పం కోసం గట్టిగా పనిచేయాలి. గుజరాత్‌లో ఎలాంటి ప్రభావం చూపు తారన్నది డిసెంబర్‌లో ఫలితాలను బట్టి చెప్పుకోవచ్చు. అక్కడ అధికారంలోకి రాకున్నా గణనీయంగా సీట్లు సంపాదించినా ఆప్ పురోగతికి అడుగులు పడినట్లుగానే చూడాలి. ఆయన ఇదే సూత్రాల మేరకు పంజాబ్‌లో అధికార వ్యవస్థను సవాల్ చేశారు. ముఠాల కుమ్ములాటలతో పాలనపై దృష్టి పెట్టని కాంగ్రెస్‌ను ఎన్నికల్లో మట్టికరిపించారు. అకాలీదళ్ నుంచి ఎదురయిన పోటీని కూడా ఆయన విజయవంతంగా అధిగమించారు. అలాగే బిజెపిని కూడా దరిదాపుల్లో లేకుండా చేసుకున్నారు. ఇది ఓ రకంగా అక్కడి ప్రజలు కోరుకున్న మార్పు. వారి నమ్మకాలను నిలబెడుతూ జాతీయ రాజకీయాలకు ఓ మోడల్‌గా నిలపాల్సిన బాధ్యతను గుర్తించాలి. భవిష్యత్తుపై ప్రతి ఒక్కరిలో పరిపూర్ణ విశ్వాసాన్ని పాదు కొల్పడంతో పాటు ప్రజలు కోరు కుంటున్న మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ రాజకీయాలకు మార్గం చూపాలి. గుజరాత్‌లో అలా చేయగలిగి విజయం సాధిస్తే ఆప్ ప్రత్యామ్నాయా పార్టీగా ప్రజలే ఆదరిస్తారు. అలా ముందుకు సాగాలంటే ఇతర పార్టీలను కూడా కలుపుకుని పోవాల్సి ఉంటుంది. 80శాతం ప్రజలు కోరుకుంటున్న విధంగా కూడు, గూడు, గుడ్డలకు ప్రాధాన్యం ఇవ్వాలి. దేశంలోని వనరులను ఉపయోగించుకుని ప్రజలకు మేలు చేయడం అన్న కెసిఆర్ మోడల్‌పై దృష్టి సారించాలి. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రధాన పోటీ నరేంద్ర మోదీ, అరవింద్ కేజ్రీవాల్ మధ్యే ఉండవచ్చన్న అన్న అంచనాలను కలిగించగలగాలి. అప్పుడే ప్రజలు కూడా ఆలోచన చేస్తారు. అయితే గుజరాత్ ఫలితాల తరవాతనే దీనిపై స్పష్టత రాగలదు

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# కేంద్రంపై వ్యతిరేకతను ఎండగట్టడమెలా?

ప్రత్యామ్నాయం చూపుతామన్న భరోసా ఎలా ● ప్రత్యామ్నాయ ప్రయత్నాలు సజావుగా సాగించేదెలా ● కెసిఆర్ జాతీయ రాజకీయాలపై కానరాని స్పష్టత

**హైదరాబాద్, నవంబర్ 17 (అక్షర వెలుగు):** ప్రస్తుత బిజెపి పాలనలో ఆర్థికరంగం కుదేలయ్యింది. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. కార్పోరేట్ రంగాలకు మేలు చేయడం, ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను అమ్మడం, జిఎస్టీతో ధరల భారాన్ని మోపడం వంటి చర్యలు ప్రజలకు సవాల్‌గా మారాయి. విపక్షాలు కూడా తమకు అధికారం అప్పగిస్తే ఇవన్నీ రద్దుచేసి చూపుతామన్న భరోసాను ప్రజలకు ఇవ్వలేక పోతున్నాయి. సిఎం కెసిఆర్ ఇంకా జాతీయ రాజకీయాలపై దృష్టి సారించలేదు. ఎప్పుడు ఎలా వెళతారన్నది స్పష్టత లేదు. ఆయన విధానాలను ఇంకా తెలంగాణ బయట ప్రపంచానికి పెద్దగా పరిచయం చేయలేదు. తాను అనుకుంటున్న గుణాత్మక మార్పు ఏమిటో ప్రజలకు చేరడం లేదు. నరేంద్ర మోదీ, అమిత్ షాల నేతృత్వం లో బిజెపి అధికారం లోకి వచ్చిన తరవాత ప్రజలకు అనేక ఆశలు కల్పించారు. కొన్ని చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారు. అందులో అనుమానం లేదు. అయితే వారి రాజకీయ పురోగమనంలో వ్యవహరిస్తున్న తీరు తెన్నులను గమనిస్తే హుందా రాజకీయాలు సాగడం లేదు. ప్రజలను వదిలి రాజకీయాలు నెరపుతున్నారు. ధరలు స్వారీ చేస్తున్నాయి. నిరుద్యోగం ప్రబలింది. పెట్రో,గ్యాస్ ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. దేశంలో ఉన్న వనరులను ఉపయో గించే సత్తా కానరావడం లేదు. వాజపేయి,ఆడ్వాణీ హయాంలో అనుసరించిన పెద్దమనిషి తరహా రాజకీయ వ్యవహార శైలి కానరావడం లేదు. ప్రత్యర్థుల అడ్డును తొలగించుకోవడమే నేటి బీజేపీ నేతల వ్యూహాలుగా మారింది.ఈ క్రమంలో భారతదేశ ఎన్నికల రాజకీయ నియమాలను బీజేపీ తనవైపు తిప్పుకుంది. సామాజిక పునర్నిర్మాణానికి కొత్త రూపమిచ్చింది. హిందూత్వ పతాకను ముందుకు తీసుకువెళు తూనే తన సామాజిక ప్రాతిపదికలను విశాలం చేసుకుంది. హిందుత్వ విషయంలో వస్తున్న విమర్శలకు గట్టిగానే జవాబు చెప్పారు. ఈ క్రమంలో 370 ఆర్టికల్ తొలగించడం, అయోధ్య, ట్రిపులత్ తలాఖ్ వంటి విషయాల్లో గట్టి నిర్ణయాలు తీసుకున్నారు. ఉమ్మడి పౌరస్మృతి కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే నోట్ల రద్దు, జిఎస్టీ వంటి నిర్ణయాలు సామాన్యులకు శరాఘాతంగా మారాయి. నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌నే తీసుకుంటే .. శాంతిభద్రతల పరిరక్షణ యంత్రాంగాన్ని పటిష్ఠం చేశారు. నేరాలను అదుపు చేశారు. గూండారాజ్యాన్ని అణచివేశారు. గత ఐదేళ్లలో శాంతి నెలకొంది. శాంతియుత పరిస్థితులను సృష్టించడంలో భారతీయ జనతా పార్టీ సఫలమయింది. మళ్లీ అధికారాన్ని స్వాధీనం చేసుకుంది. ఇవన్నీ గమనించి ప్రజలకు ఏ మేరకు మంచి చేయవచ్చో అన్నదానిపై విపక్షాలు కఠిన పరిశ్రమ చేయాలి. దేశంలో నీటి వనరులు ఉన్నా సరిగా ఉపయోగం కావడం లేదు. పర్యావరణం దెబ్బ తింటోంది. నేటికీ విద్యుత్, రవాణా లేని గ్రామాలు అనేకం. ప్రభుత్వాలకు ఆదాయం పెరుగుతున్నా విచ్చలవిడి విలాసాలకు ప్రజాధనం ఖర్చవుతోంది. అధికారులు, నాయకులు ప్రజల డబ్బును ఊదేస్తున్నారు. వీటిని అరికట్టగలిగితే.. అనుత్పాదక రంగాలకు డబ్బులను ఆపితే భారత్ ఆర్థికంగా నిలదొక్కుగోలదు. డాలర్ మారకం రేటు అదేపనిగా పెరగకుండా చూసుకోవాలి. రూపాయి బలపడాలి. ఇవన్నీ కూడా బ్రహ్మాండమైన విద్యలేమీ కావు. కొద్దిగా చిత్తశుద్ధితో సంకల్పంతో పనిచేస్తే సాధ్యం కానిదేమీ లేదు. ఇవన్నీ చేస్తాడన్న నమ్మకం కలిగించలగలిగితే బిఆర్ఎస్ స్థాపించిన కెసిఆర్ ప్రత్యామ్నాయం కాగలరు. అందుకు ముందుగా తెలంగాణ రాజకీయాల్లో మార్పులు రావాలి. మరింతగా తన సమర్థతను నిరూపించుకోవాల్సిన అసవరాన్ని కెసిఆర్ గగుర్తించాలి.. అందువల్ల వనరులను ఉపయోగించుకుంటూ,ఉపాధి కల్పిస్తూ, శాంతిభద్రతలకు పెద్దపీట వేస్తూ డ్రగ్స్‌ను అరికట్టగలిగేలా కఠిన చర్యలకు ఉపక్రమిస్తే విజయం సాధిస్తారు. ఉచిత పథకాలే పాలన అనుకుంటే కెసిఆర్ కూడా చరిత్రలో కలసి పోతారు. అలా కాకుండా నిర్మాణాత్మక రాజకీయాలు నెరపాలి. అందుకు వృధా,ఉచిత పథకాలను పక్కన పెట్టాలి. కిలో రూపాయి బియ్యాన్ని తక్షణం సమీక్షించాలి. రైతుబంధులో ఉన్నపెద్దలను తొలగించాలి. ధరణి లాంటి సమస్యల పరిష్కరించాలి. భూ తగాదాలను సత్వరం నివారించాలి. సమస్యలపై తక్షణ స్పందన కానరావాలి. అప్పుడే బిఆర్ఎస్ అడుగు ముందుకు పడగలదు.

# తెలంగాణలో కులవృత్తులకు ప్రోత్సాహం

(మొదట పేజి తరువాయి) **వనపర్తి, నవంబర్ 17 (అక్షర వెలుగు):** తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న అనేక కార్యక్రమాల వల్ల కులవృత్తులు పునర్జీవం పోసుకుంటున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. వనపర్తి నియోజకవర్గం శ్రీరంగాపురం మండలకేంద్రంలోని రంగసముద్రంలో ప్రభుత్వ ఉచిత చేపల పంపిణీలో భాగంగా చెరువులో రొయ్యలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో చెరువులు ఎండిపోయి, మత్స్యకారులు వలసపోయారని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి మిషన్ కాకతీయ పథకం కింద చెరువులు నింపారని గుర్తు చేశారు. ఉచిత చేప పిల్లలు చెరువుల్లో విడిచి మత్స్యకారులకు ఉపాధి కల్పించారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు చేపల రూపంలో అందుబాటులో పౌష్టికాహారం,సబ్సిడీ గొర్రె పిల్లలతో గొల్ల కురుమలకు ఆర్థిక స్థిరత్వం కలుగుతుందని అన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఉచితంగా 24 గంటల కరంటు, సాగునీటి సౌకర్యంతో రైతులలో ఆత్మవిశ్వాసం పెరిగిందని వెల్లడించారు. రైతు ఏ కారణం చేత మరణించినా 10 రోజులలో రూ.5 లక్షల పరిహారం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వివరించారు. తెలంగాణ అమలు చేస్తున్న పథకాలను కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు పేర్లు మార్చి పథకాలు అమలు చేస్తున్నా యని ఆరోపించారు . ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# డోనాల్డ్ ట్రంప్‌కు కూతురు ఇవాంకా షాక్

(మొదట పేజి తరువాయి) **వాషింగ్టన్, నవంబర్ 17 (అక్షర వెలుగు):** అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాను మరోసారి అధ్యక్ష బరిలోకి దిగుతున్నట్లు బుధవారం ప్రకటించారు. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మళ్లీ తాను పోటీ చేస్తున్నట్లు తాజాగా ట్రంప్ స్పష్టం చేశారు. అయితే, ఆయన ఈ ప్రకటన చేసిన గంటల వ్యవధిలోనే కూతురు ఇవాంకా ట్రంప్ ఆయనకు ఊహించని షాక్ ఇచ్చారు. ఆమె తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై రాజకీయాలకు దూరంగా ఉండబోతున్నట్టు పేర్కొన్నారు. గతంలో తండ్రి ఎన్నికల్లో మాఎ కీలక పాత్ర పోషించారు. ప్రచారంలో కొత్త ఎత్తులు వేసి ముందుకు సాగారు. ఇప్పుడు మాత్రం కుదరదని తేల్చేశారు. రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో తన తండ్రి తరఫున ప్రచారం కూడా చేయబోనని ఆమె స్పష్టం చేశారు. దీనికి కారణం ఇవాంకా తన వ్యక్తిగత జీవితమే అని చెప్పారు. ఈసారి తన పిల్లల కోసం సమయాన్ని కేటాయించనున్నట్టు ఆమె వెల్లడించారు. అంతేగాక తాను ప్రస్తుతం మియామిలో ప్రైవేట్ సెక్టార్‌లో పని చేస్తున్నానని, ఇది తన జీవితంలోనే అత్యంత ముఖ్యమైన సమయంగా ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే రాజకీయాల్లో జోక్యం చేసుకోవాలన్న ఆసక్తి ప్రస్తుతానికి తనకు లేదన్నారు. అయితే, తన తండ్రికి తాను ఎప్పుడూ మద్దతు ఇస్తానన్నారు. కానీ, ఈ మద్దతు అనేది రాజకీయాలకు సంబంధం లేకుండా ఉంటుందని ఇవాంకా చెప్పుకొచ్చారు. కాగా, గతంలో డోనాల్డ్ ట్రంప్ హయాంలో ఆమె ప్రభుత్వ సలహాదారుగా పని చేసిన విషయం తెలిసిందే. ఆమె భర్త జరేద్ కుష్నర్ కూడా ట్రంప్‌కు సలహాదారుగా వ్యవహరించారు. ఇక ఇవాంకా తీసుకున్న ఈ నిర్ణయం ట్రంప్‌కు గట్టి షాక్ అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే ప్రెసిడెంట్ ఎన్నికల్లో తండ్రి ప్రచారంలో కీలకంగా మారుతుందనుకున్న ఆమె.. ఇలా కోలుకోని షాక్ ఇవ్వడం ఇప్పుడు నెట్టింట చర్చనీయాంశం అవుతోంది.

# జడ్జి అభిషేక్ రెడ్డి బదిలీపై న్యాయవాదుల ఆందోళన

హైదరాబాద్,నవంబర్17(అక్షర వెలుగు): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అభిషేక్ రెడ్డి బదిలీపై న్యాయవాదులు ఆందోళనకు దిగారు. అభిషేక్ రెడ్డి బదిలీ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని హైకోర్టు ముందు ఆందోళన చేపట్టారు. జస్టిస్ అభిషేక్ రెడ్డిని పాట్నా హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. సుప్రీం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జరిగిన కొలీజియం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే కొలిజియం సిఫార్సును వెంటనే వెనక్కి తీసుకోవాలని.. న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. జస్టిస్ అభిషేక్ రెడ్డి 1990 నుంచి న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించి... 2019 ఆగస్టు 26న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. వాషింగ్టన్ డీసీలోని అమెరికన్ యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం పూర్తి చేసిన ఆయన...1990లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. హైకోర్టుతో పాటు సివిల్ కోర్టులో కూడా రాజ్యాంగ కేసులను అభిషేక్ రెడ్డి వాదించారు.

# స్కూల్,కాలేజీ విద్యార్థినులకు శానిటరీ కిట్స్



(మొదట పేజి తరువాయి) **హైదరాబాద్, నవంబర్ 17 (అక్షర వెలుగు):** రాష్ట్రంలో వైద్యారోగ్య రంగాన్ని పటిష్టం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణ కోసం చర్యలు చేపట్టింది. ఈ సంవత్సరం బడ్జెట్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్న విధంగా ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో ఉచితంగా శానిటరీ హెల్త్ అండ్ హైజెనిక్ కిట్లు పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు గాను మొత్తం రూ. 69.52 కోట్లతో అడలోసెంట్ హెల్త్ కిట్ల కొనుగోలు, పంపిణీ కోసం ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు హెల్త్ సెక్రెటరీ రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లోని 8 నుంచి 12వ తరగతి చదువుతున్న దాదాపు 11 లక్షల మంది విద్యార్థినులకు లబ్ధి చేకూర నున్నది. ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఆరు నెలల కోసం11 లక్షల కిట్లు కొనుగోలు చేయనున్నది. ఈ కిట్‌లో ఆరు శానిటరీ న్యాప్‌కిన్ ప్యాక్స్, వాటర్ బాటిల్, ఒక బ్యాగ్ ఉంటాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం 22 లక్షల కిట్లు కొనుగోలు చేయనుంది. ఈ కార్యక్రమం అమలు చేస్తామని ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లోనే ప్రకటించింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం..15-24 ఏళ్ల మధ్య వయసున్న యువతుల్లో సుమారు 32 శాతం మంది న్యాప్‌కిన్ బదులు క్లాత్ వినియోగిస్తున్నారు. దీంతో గర్భాశయ, మూత్రకోశ సంబంధ ఇన్‌ఫెక్షన్లు వస్తున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం హెల్త్ అండ్ హైజెనిక్ కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించింది. 14 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న కౌమర బాలికలు రుతుక్రమం సమయంలో శుభ్రత పాటించేందుకు ఇవి ఉపయోగపడతాయి. దీంతో వారు ఆరోగ్యవంతంగా ఉండేందుకు, తద్వారా చదువుపై మరింత శ్రద్ధ చూపించేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థినుల హాజరు శాతం కూడా పెరిగేందుకు తోడ్పడుతుంది. అలాగే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని 8 నుంచి 12వ తరగతి చదువుతున్న దాదాపు 11లక్షల మంది విద్యార్థినులకు లబ్ది చేకూరనుంది. ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఆరు నెలల కోసం11 లక్షల కిట్లను ప్రభుత్వం కొనుగోలు చేయనుంది.

# రైల్వేలో ఇక్యూ కోటా దందా

## ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,నవంబర్17(అక్షర వెలుగు): అక్రమంగా డబ్బు సంపాదించేందుకు నకిలీ స్టాంపులు, రైల్వే బోర్డు అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన ఇద్దరిని గోపాలపురం పోలీసులు అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్ పార్శిగుట్ట సంజీవయ్యపురానికు చెందిన బండారు కుమార్ (67), తిరుమలగిరి రామకృష్ణపురం గీతానగర్‌కు చెందిన జీ నాగరాజు (49) ఇతను రైల్వేలో చీఫ్ టెలిఫోన్ ఆపరేటర్లు. ఇద్దరు స్టేషన్ పరిధిలో ఉన్న ట్రావెల్స్ ఏజెంట్లతో కలిసి ప్రయాణికులకు రైల్వే టికెట్‌లు కన్‌ఫాం చేస్తామని చెబుతున్నారు. ఇందుకోసం నకిలీ స్టాంపులు, రైల్వే బోర్డ్ అధికారి సంతకాలను ఫోర్జరీ చేసి ఎమర్జెన్సీ కోటా కింద కన్‌ఫాం చేయిస్తారు. ఒక్కొక్క టికెట్‌పై రూ.700 నుంచి రూ. 1500 వరకు కమీషన్ తీసుకుంటారు. ఈక్యూ కోటా కింద టికెట్లు అధిక సంఖ్యలో రావడంతో అనుమానం వచ్చిన రైల్వే అధికారులు సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులకు పంపించారు. కేసు నమోదు చేసుకున్న ఆర్పీఎఫ్ పోలీసులు నిఘా పెట్టారు. లాడ్జీల వద్ద అనుమానాస్పదం గా తిరుగుతుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. కేసును గోపాలపురం పోలీసులకు అప్పగించగా వారు దర్యాప్తు చేస్తున్నారు.

# కొత్త బుల్లెట్‌ప్రూఫ్ వాహనం ఇవ్వండి



(మొదట పేజి తరువాయి) **హైదరాబాద్, నవంబర్ 17 (అక్షర వెలుగు):** తనకు ప్రభుత్వం ఇచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఇవ్వడంలో వివక్ష ఎందుకని ప్రశ్నిస్తూ..ఇంటెలిజెన్స్ ఐజీకి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ రాశారు. ప్రభుత్వం తనకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వెహికిల్ ..తరచూ రిపేర్లకు గురవుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడికి వెళ్లలేక పోతున్నానని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల కొత్తగా నలుగురు ఎమ్మెల్యేలకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు ఇచ్చినప్పుడు..తనకెందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇవ్వొద్దని చెప్పారా... లేక మీరే ఇవ్వడం లేదా అని ప్రశ్నించారు. కొత్త వెహికల్ ఇవ్వకపోతే..పాతదాన్ని తీసుకోవాలని ఐజీని కోరారు. తెలంగాణ ప్రభుత్వం తనకు కేటాయించిన 13 ఏండ్ల నాటి పాడైన బులెట్ ప్రూఫ్ వాహనాన్ని ఉపయోగించడం సిగ్గు అనిపిస్తుందని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అసహనం వ్యక్తంచేశారు. రన్నింగ్ లో ఉన్నప్పుడు ఎక్కడపడితే అక్కడ ఆగిపోతూ తరచూ ఇబ్బందులు కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనం కండీషన్ లో లేకపోవడంతో గోషామహల్ నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు వెళ్లలేక ఆటంకాలు కల్పిస్తుందన్నారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణాలో ఒక ఎమ్మెల్యేకు కొత్త వాహనాన్ని ఇవ్వలేకపోయారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇటీవల అఫ్జల్ గంజ్ మార్కెట్ వద్ద రాజాసింగ్ కు కేటాయించిన బు÷-లలెట్ ప్రూఫ్ కారు మొరాయించింది. డ్రైవర్ కారు దిగి మళ్లీ స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. కారు మొరాయించడానికి కారణం తెలుసుకునేందుకు రాజాసింగ్ సైతం కారు దిగి ప్రయత్నం చేసినా కారు స్టార్ట్ కాలేదు. దీంతో రాజాసింగ్ తన కారును, డ్రైవర్ ను అక్కడే వదిలేసి.. నడుచుకుంటూ ఇంటికి వెళ్లిపోయారు. ప్రాణహాని ఉన్న తన పట్ల ప్రభుత్వ తీరు సరిగా లేదని రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు.

# అర్జున విజేతలకు సిఎం కెసిఆర్ అభినందనలు

## తెలంగాణకు గర్వకారణమని ప్రశంసలు



హైదరాబాద్,నవంబర్17(అక్షర వెలుగు): టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ కనబరిచిన తెలంగాణ బిడ్డ ఆకుల శ్రీజకు,నిఖత్ జరీన్‌లకు ప్రతిష్టాత్మక అర్జున అవార్డు రావడం పట్ల సీఎం కేసీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. తన ప్రతిభతో క్రీడారంగంలోశ్రీజ ఉన్నత స్థాయికి చేరుకోవాలని సీఎం ఆకాంక్షించారు. ఆకుల శ్రీజతో పాటుగా నిఖత్ జరీన్ కు కూడా అర్జున పురస్కారానికి కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. టీటీ లెజెండ్ ఆచంట శరత్ కమల్ అత్యున్నత క్రీడా పురస్కారం ఖేల్‌రత్న అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు సెంట్రల్ స్పోర్ట్స్ మినిస్టీ 2022కి గాను స్పోర్ట్స్ అవార్డు విన్నర్ల లిస్ట్‌ను సోమవారం ప్రకటించింది. మొత్తం 25 మంది అథ్లెట్లు అర్జునకు ఎంపికయ్యారు. ఈ నెల 30న రాష్ట్రపతి భవన్‌లో జరిగే వేడుకలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డుల్ని అందజేయనున్నారు. ప్రపంచ మహిళా బాక్సింగ్ ఛాంపియన్, తెలంగాణ బిడ్డ నిఖత్ జరీన్ కు కేంద్రం అర్జున అవార్డును ప్రకటించింది. క్రీడారంగంలో అత్యంత ప్రతిభను కనబరిచే క్రీడాకారులకు ప్రతి ఏటా ఇచ్చే అర్జున అవార్డుల్లో ఈసారి నిఖత్ జరీన్‌కు రావడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హర్షం వ్యక్తం చేశారు. అంచెలంచెలుగా ఎదిగి తెలంగాణ కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేసిన నిఖత్‌కు అర్జున అవార్డు రావడం తెలంగాణకే గాక, దేశానికే గర్వకారణమని మంత్రి అన్నారు. ప్రపంచ స్థాయిలో మరింతగా రాణించి, దేశ కీర్తిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# కొత్తగా 15 ఫైర్ స్టేషన్లు మంజూరు

(మొదట పేజి తరువాయి) **హైదరాబాద్, నవంబర్ 17 (అక్షర వెలుగు):** రాష్ట్రంలో కొత్తగా 15 ఫైర్ స్టేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. వాటి నిర్వహణకు అవసరమైన 382 ఉద్యోగాలను కూడా మంజూరుచేసింది. ఈ మేరకు అగ్నిమాపక కేంద్రాలు, ఉద్యోగాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో ఇప్పటివరకు ఫైర్ స్టేషన్లు లేని శాసనసభ నియోజకవర్గాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నది. కాగా, కొత్తగా మంజూరైన ఉద్యోగాల్లో 367 పోస్టులను శాశ్వత ప్రాతిపదికన, 15 పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకోనున్నారు. మల్కాజిగిరి, ఎల్బీ నగర్, రాజేంద్రనగర్, షాద్‌నగర్, అంబర్‌పేట, చాంద్రాయణగుట్ట, జూబ్లీహిల్స్, స్టేషన్ ఘనపూర్, డోర్నకల్, నర్సాపూర్, హుస్నాబాద్, కల్వకుర్తి, బాల్కొండ, ధర్మపురి, పినపాక నియోజకవర్గాల్లో కొత్తగా అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

# ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేస్తున్న గవర్నర్లు

## మీడియా సమావేశంలో సిపిఐ కార్యదర్శి రాజా

హైదరాబాద్,నవంబర్17(అక్షర వెలుగు): తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్లు ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలు చేస్తున్నారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా ధ్వజమెత్తారు. తెలంగాణ, కేరళ గవర్నర్లు.. ఆయా రాష్ట్రాల పాలనలో జోక్యం చేసుకుంటున్నారు. ఇది సరైంది కాదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో రాజా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను లూటీ చేస్తు కార్పొరేట్ శక్తులకు అమ్ముతుందని మండిపడ్డారు. దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని 2014 ఎన్నికల సందర్భంగా మోదీ హామీ ఇచ్చారు. కానీ ఆ హామీని మోదీ నెరవేర్చలేకపోయారని నిప్పులు చెరిగారు. మోదీ విధానాల వలన రూపాయి విలువ పతనమైందన్నారు. ఒకే దేశం ఒకే పన్ను విధానం అమలు చేయడంతో రాష్ట్రాలకు నిధులు రావడం లేదన్నారు. ప్రాంతీయ, జాతీయ పార్టీలు కలిసి బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. 2024లో మోదీని గద్దె దింపుతామన్నారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టిస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని రాజా పేర్కొన్నారు.

# ట్రాన్స్‌కో ఉద్యోగులకు అన్యాయం జరిగితే సహించం

(మొదట పేజీ తరువాయి) పాటు వెనక్కి నెట్టి..వాళ్ల ప్రమోషన్స్ ను రద్దు చేయడం తగదన్నారు. ట్రాన్స్‌కో ఉద్యోగులు తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, వాళ్ల త్యాగాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిందని ట్వీట్ చేశారు. పీ ఉద్యోగుల కోసం తెలంగాణ ట్రాన్స్ కో ఉద్యోగులను రోడ్డు మీద పడేసే కుట్ర జరుగుతోందంటూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్వీట్ లో ఆరోపించారు. రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులకు తమ పార్టీ అండగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఉద్యోగులకు ప్రమోషన్స్ ను రద్దు చేస్తే ఊరుకునేది లేదన్నారు.

# బాలలకు శ్రీరామరక్ష శ్రీ సత్యసాయి సంజీవని కేంద్రం

(మొదట పేజీ తరువాయి) నెలకొల్పారన్నారు. ఈ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అనివిధాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. మానవ సేవయే మాధవ సేవగా భావించే మధుసూదన్ సాయి చేతుల మీదుగా విద్యాలయాలు, వైద్యాలయాలను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కొండపాక విద్యా వైద్యాలయం సింబల్ ఆఫ్ చారిటీగా నిలుస్తున్నదని తెలిపారు. ఈ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటుచేసేలా కృషి చేసిన ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు ఈ వైద్యాలయం ద్వారా కావాల్సిన వైద్య చికిత్సలు అందిస్తామని శ్రీ సద్గురు మధుసూదన్ సత్యసాయి వెల్లడించారు. నవంబర్ 23న సత్యసాయిబాబా జన్మదినం సందర్భంగా నేడు ఈ వైద్యాలయాన్ని ప్రారంభించుకున్నామని చెప్పారు. మనుషుల్లో ఉండే భగవంతుని గుర్తించడమే నిజమైన మాధవ సేవ అన్నారు.

# ఆగని పెట్రోల్ బంక్ మోసాలు

(మొదట పేజీ తరువాయి) రాజేంద్రనగర్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో చిప్ అమర్చి మోసం చేస్తున్న వైనం బయటపడింది. ఆ మోసం తెలిసి ÷ర్ అయ్యారు వాహనదారులు. ÷ాజేంద్రనగర్ సర్కిల్‌లోని 313 ఫిల్లర్ దగ్గర ఉన్న ఇండియన్ పెట్రోల్ బంకులో చిప్ అమర్చి పెట్రోల్‌ను తక్కువ పోస్తున్నట్లు గుర్తించారు పలువురు వాహనదారులు. బంకు ముందు ఆందోళనకు దిగారు. ప్రతి ఐదు లీటర్లకు అరలీటరు చొప్పున తక్కువగా రావడంతో వెంటనే అధికారులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న తూనికల శాఖ అధికారులు, ఎస్‌వోటీ పోలీసులు, సివిల్ సప్లయి అధికారులు ఏకకాలంలో బంకుపై దాడులు చేశారు. పెట్రోల్ మోసం నిజమేనని నిర్ధారించారు. పెట్రోల్ పోసేందుకు అమర్చిన చిప్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాహనదారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు అధికారులు.

# జిల్లాలో భగ్గుమన్నపాతకక్షలు

నిజామాబాద్,నవంబర్17(అక్షర వెలుగు): జిల్లాలో పాత కక్షలు భగ్గుమన్నాయి. ఫిబ్రవరిలో దాడి చేసిన గ్యాంగ్ సభ్యుడిని ప్రత్యర్థి వర్గం కిడ్నాప్ చేసి ఆపై హత్యాయత్నానికి పాల్పడింది. డైరీ ఫారం వద్ద మొన్న రాత్రి రిజ్వాన్‌ను పాగల్ ఇర్ఫాన్ మరి కొంతమందితో కిడ్నాప్ చేశాడు. అనంతరం నటరాజ్ థియేటర్ సమీపంలో రిజ్వాన్‌పై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రిజ్వాన్‌ను స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. గతంలో జంగిల్, ఇబ్బు అనే రౌడీషీటర్‌ల మధ్య జరిగిన దాడి ఘటనే ఈ కిడ్నాప్‌కు కారణంగా తెలుస్తోంది. ఇబ్బా దొరకకపోవడంతో అతని తమ్ముడు రిజ్వాన్‌ను మరో వర్గం కిడ్నాప్ చేసింది. ప్రస్తుతం రిజ్వాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మెటా ప్లాట్‌ఫామ్ ఇండియా హెడ్‌గా సంధ్యా దేవనాథన్

న్యూఢిల్లీ, నవంబర్ 17 (అక్షర వెలుగు): ఫేస్‌బుక్‌కు చెందిన మెటా ప్లాట్‌ఫామ్ సంధ్యా దేవనాథన్‌ను ఇండియా హెడ్‌గా నియమించింది. మెటా వైస్ ప్రెసిడెంట్‌గా కూడా ఆమె బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఇటీవలే మెటా నుంచి అజిత్ మోహన్ వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ప్రత్యర్థి కంపెనీ స్నాప్‌లో అతను చేరాడు. వాట్సాప్ ఇండియా హెడ్ అభిజిత్ బోస్, మెటా ఎ÷-లాట్‌ఫామ్ పబ్లిక్ పాలసీ డైరక్టర్ రాజీవ్ అగర్వాల్ కూడా ఇటీవల రిజైన్ చేసిన విషయం తెలిసిందే. ÷శిస్‌బుక్‌పై ప్రస్తుతం ఇండియాలో రెగ్యులేటరీ సమస్యలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధిస్తున్న తరుణంలో సంధ్యా దేవనాథన్ నియామకం కీలకంకానున్నది.

# నేనో రాష్ట్రానికి సిఎంను..పారిపోయే వ్యక్తిని కాదు

(మొదట పేజీ తరువాయి) గెలిచినప్పటి నుండి తమ ప్రభుత్వాన్ని కూల్చే యత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కుట్రదారులు జలాంతర్గామిలా పనిచేస్తున్నా రని, నీటి నుండి పైకి రావడానికి భయపడుతున్నారని, కానీ ఉపరితలం పైకి వచ్చే సమయం వచ్చిందని సోరెన్ అన్నారు. బిజెపి ఫిర్యాదు మేరకు తనపైఅనర్హత వేటు వేయాలన్న ఎలక్షన్ కమిషన్ ఆదేశాలపై గవర్నర్ త్వరగా స్పందించాలని అన్నారు. కుంభకోణం ఆరోపణలు నిరాధారమని, మోడీ ప్రభుత్వం త్వరలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లోని మరింత మంది నేతలపై ఇడి, సిబిఐలతో దాడులు చేయించనుందని అన్నారు.అక్రమ మైనింగ్ జరిగిందన్న సాహిబ్‌గంజ్ జిల్లా వివరాలను అందిస్తూ.. రూ. వెయ్యికోట్లు అపహరించాలంటే చట్టబద్ధమైన మైనింగ్ కంటే అక్రమమైనింగ్ నాలుగు రెట్లు ఉండాలని సోరెన్ పేర్కొన్నారు. అలాగే వాటిని రవాణా చేయడానికి 20వేల రైల్వే బోగీలు, 33 లక్షల ట్రక్కులు కావాలని, సరైన పత్రాలు లేకుండా రైల్వే రవాణా చేయదని, మీరు ఎవరైనా రైల్వే అధికారిలా వ్యవహరించారా అంటూ బిజెపి ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. గడిచిన రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.750 కోట్లు మాత్రమే సంపాదించిందని, అయితే వెయ్యికోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తున్నారని .. ఆరోపణలు చేయడానికి ముందు ఈ సమచారాన్ని మీరు గమనించలేదని భావిస్తున్నానని అన్నారు. తమ పార్టీ నుండి ఇటీవల బిజెపిలో చేరిన నేత రవికేజ్రివాల్ ప్రకటనలపై కూడా సందేహాలు వ్యక్తం చేశారు. రహస్య అజెండా లేదా తప్పుడు ఉద్దేశం లేకుండా ఇడి విచారణ జరుగుతుందని తాను ఆశిస్తున్నానని సోరెన్ పేర్కొన్నారు. మరోవైపు జార్ఖండ్ లో సీఎం హేమంత్ సోరెన్ కు మద్దతుగా జేఎంఎం కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం సోరెన్ సర్కార్ ను కావాలనే ఇరకాటంలో పెడుతోందని ఆరోపించారు. బీజేపీయేతర రాష్ట్రాలను కేంద్రం టార్గెట్ చేస్తోందని మండిపడ్డారు. హేమంత్ సోరెన్ తప్పు చేస్తే ఎందుకు అరెస్ట్ చేయడం లేదని నిలదీశారు. మైనింగ్ కేసులో ఈడీ సమన్లు మాత్రమే జారీ చేసిందని జేఎంఎం కార్యకర్తలు చెప్పారు. అక్రమ మైనింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ రాంచీలోని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ ముందు హాజరయ్యారు. ఈనెల 3న ఈడీ ముందు సోరెన్ హాజరుకాకపోవడంతో ఆయనకు సమన్లు జారీ చేశారు. సమన్లను మూడు వారాలకు వాయిదా వేయాలని కోరారు. కానీ ఈడీ అధికారులు అందుకు నిరాకరించారు. కావాలనే కుట్రలో భాగంగానే ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు విచారణకు పిలిచారని..తాను అక్రమాలకు పాల్పడితే అరెస్ట్ చేయాలన్నారు. తప్పుచేయనప్పుడు తాను ఎవరికీ భయపడనని..ఆందోళన చెందనవసరం లేదని హేమంత్ చెప్పారు.

# తెలంగాణలోనే అత్యధికంగా కరెంట్ ఛార్జీలు



(మొదట పేజీ తరువాయి) హైదరాబాద్,నవంబర్17(ఆర్ఎన్ఎ): దేశంలోనే సిల్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ మిగిలిపోయారని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సొంతంగా ట్రబుల్స్ క్రియేట్ చేసి వాటిని జనంపైకి వదులుతున్నారని ఎంపి మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... సొంత కూతురు, ఎమ్మెల్యేలను అమ్ముకునే పరిస్థితికి కేసీఆర్ వచ్చారని విమర్శలు గుప్పించారు. సీఎం కేసీఆర్ భ్రష్టు పట్టడానికి కారణం కొడుకు, బిడ్డలే అని అన్నారు. తెలంగాణను సీఎం కేసీఆర్ స్వయంగా అంధకారంలోకి నెట్టి వేస్తున్నారని ఆరోపించారు. పవర్ సెక్టార్‌ను గాలికొదిలేసి పాలకులు గంజా, డ్రగ్స్ పార్టీల్లో బిజీగా ఉన్నారన్నారు. బిడ్డ బ్యూటీ పార్లర్ మీద సంపాదించిన డబ్బుతో రాష్ట్రాన్ని ఉద్ధరిస్తున్నట్లు కేసీఆర్ ఫీలవుతున్నారని ఆయన వ్యాఖ్యలు చేశారు.టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు ఫోన్ చేసిందని అర్వింద్ ఆరోపించారు. తన తండ్రిపై అలిగిన కవిత కాంగ్రెస్ లోకి వెళ్తానని.. ఖర్గేకు ఫోన్ చేసిందని చెప్పారు. ఈ విషయం తెలిసిన కేసీఆర్.. సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు ములాయం సింగ్ యాదవ్ చనిపోయినప్పుడు కవితను తన వెంటే లక్నోకు తీసుకెళ్లారన్నారు. తన కూతురు తన వెంటే ఉన్నారని తెలిసేందుకు మీడియా ముందు డ్రామా ఆడారన్నారు. కవిత, కేటీఆర్ లను తమ పార్టీలో చేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. దేశంలోనే అత్యధికంగా యూనిట్ విద్యుత్‌కు 9.50 రూపాయలు వసూలు చేస్తోన్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని అన్నారు. తెలంగాణ వస్తే.. పది కొత్త థర్మల్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తానన్న కేసీఆర్ మాట తప్పారన్నారు. టీఆర్ఎస్, ఆమ్ ఆద్మీ పార్టీలు లిక్కర్ స్కాం పార్టనర్స్ అని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే పెన్షన్స్ కరెంటు బిల్లులు కట్టేందుకు సరిపోవటంలేదని తెలిపారు. విద్యుత్ శాఖలో ఖాళీలను ఎప్పుడు భర్తీ చేస్తారలో చెప్పాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేశారు.టీఆర్ఎస్ వైఫల్యాలపై కేంద్రం తమను రిపోర్టు ఇవ్వాలని కోరిందన్నారు. 25 సెక్టార్స్ పై ప్రస్తుత అధ్యయనం కొనసాగుతుందని తెలిపారు. కేటీఆర్,కవిత రాష్ట్రంతో పాటు కేసీఆర్ ను కూడా భ్రష్టుపట్టించారన్నారు. ఎక్కువ రేటుకు కరెంట్ కొని రాష్ట్ర ప్రజలపై భారం మోపారన్నారు. కేసీఆర్ , కేటీఆర్ కు రాష్ట్రం మీద నియ్యత్ లేదన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే 10 థర్మల్ పవర్ ఎ÷-లాంట్లు పెడతానని చెప్పిన కేసీఆర్.. కేవలం ఒక్కటే మాత్రమే కంప్లీట్ చేశారని తెలిపారు. యాదాద్రి పవర్ ఎ÷-లాంట్ ఇంకా పూర్తికాలేదన్నారు. ఫ్రీ కరెంట్ పేరుతో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఫించన్.. కరెంటు బిల్లులకు కూడా సరిపోవడం లేదని విమర్శించారు.

# ఐజ్వాల్‌లో ఇంటర్నేషనల్ టూరిజం మార్ట్



(మొదట పేజీ తరువాయి) పర్యాటక అభివృద్ధి సాధ్యం కాదని కిషన్ రెడ్డి అన్నారు. ఇంటర్నేషనల్ టూరిజం మార్ట్ పర్యాటకరంగ ప్రాధాన్యతలను ప్రదర్శిస్తుందని తెలిపారు. అదేవిధంగా జీ20 టూరిజం టాస్క్ ను కూడా నిర్వహించబోతుందన్నారు. వచ్చే ఏడాది నుంచి భారత్ జీ20కి నేతృత్వం వహించనుందని.. ఇందులో ఒక కీలక మీటింగ్ ఐజ్వాల్ లో నిర్వహించనున్నట్లు తెలిపారు. నార్త్ ఈస్ట్ స్టేట్స్‌కు స్వదేశీ దర్శన్‌లో భాగంగా 1337 కోట్ల అందించామని కిషన్ రెడ్డి తెలిపారు.ఈశాన్యంలో శాంతి నెలకొంటుందని.. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఈ దిశగా ప్రత్యేకమైన చొరవతీసుకుంటున్నాయని చెప్పారు.అరుణాచల్ ప్రదేశ్, త్రిపురలో రైలు కనెక్టివిటీ పూర్తయిందన్నారు. జాతీయ రహదారుల కోసం ఇప్పటి వరకు 52వేల కోట్లు ఖర్చు చేశామన్నారు.

# శ్రద్ధా హత్యకేసులో అఫ్తాబ్‌కు షాక్

## మరో ఐదురోజుల పోలీస్ రిమండ్‌కు అనుమతి

న్యూఢిల్లీ,నవంబర్17(అక్షర వెలుగు): తన ప్రియురాలు శ్రద్ధా ను దారుణంగా చంపి ముక్కలు చేసిన అఫ్తాబ్ కు ఢిల్లీ కోర్ట్ షాకిచ్చింది. మరో ఐదు రోజుల పోలీస్ రిమాండ్‌కు అప్పగించింది. కోర్టు ఇప్పటికే విధించిన కస్టడీ నేటితో ముగియడంతో పోలీసులు అఫ్తాబ్‌ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రవేశపెట్టారు. పది రోజుల కస్టడీ విధించాలని కోరారు. అయితే కోర్టు అఫ్తాబ్‌కు ఐదు రోజుల రిమాండ్‌కు అప్పగించింది. నార్కో అనాలిసిస్ టెస్టులకు కూడా కోర్టు అనుమతించింది. దీంతో అసలు విషయాలు పూర్తిగా వెలుగులోకి రానున్నాయి. అఫ్తాబ్, శ్రద్ధా గతంలో ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌కు కూడా వెళ్లడంతో ఢిల్లీ పోలీసులు అతడిని ఆ రాష్ట్రాలకు తీసుకెళ్లనున్నారు. ఢిల్లీలోని మెహ్రౌలీ ప్రాంతంలో ఉన్న ప్లాటులో అఫ్తాబ్ మే 18న శ్రద్ధాను చంపేశాడు. ఆ మరుసటి రోజు పది గంటల పాటు శ్రమించి ఆమె శరీరాన్ని 35 ముక్కలుగా చేశాడు. ముక్కలుగా కోసేముందు శ్రద్ధా శవంపై వేడినీళ్లు పోశాడు. సులభంగా కోసేందుకు అవకాశం ఉంటుందని అలా వేడినీళ్లు పోసినట్లు అఫ్తాబ్ పోలీసులకు తెలిపాడు. 35 ముక్కలను 18 ప్యాకుల్లో అమర్చాడు. ఒక్కో ప్యాక్‌ను ఒక్కోరోజు చొప్పున 18 రోజుల పాటు రాత్రి 2 గంటల సమయంలో మెహ్రౌలీ అటవీ ప్రాంతంలో పడేశాడు. శ్రద్ధా తండ్రి నవంబర్ 11న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. శ్రద్ధాను ఆరు నెలల క్రితమే దారుణంగా చంపి ఏమీ తెలియనట్లుగా ఉంటోన్న అఫ్తాబ్‌ను అరెస్ట్ చేసి విచారణ జరపడంతో చేసిన ఘాతుకాన్ని ఒప్పుకున్నాడు. పోలీసులు ఇప్పటివరకూ శ్రద్ధాకు చెందిన 13 ఎముకలను మెహ్రౌలీ అటవీ ప్రాంతం నుంచి స్వాధీనం చేసుకున్నారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా వీటిని గుర్తిస్తారు. ఈ హత్య కేసులో ఆధారాలు సేకరించడం పోలీసులకు సవాలుగా మారుతోంది. ఇప్పటివరకూ ఇంకా పూర్తి స్థాయిలో ఆధారాలు సేకరించలేకపోయారు.



# యాదాద్రీశుడి సేవలో ప్రహ్లాద్ జోషి

(మొదట పేజీ తరువాయి) చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ప్రహ్లాద్ జోషికి.. అర్చకులు ఆశీర్వచనం అందించగా, ఆలయ అర్చకులు స్వామివారి లడ్డు ప్రసాదం అందజేశారు. అంతకుముందు ఆయనకు ఆలయ అధికారుల, అర్చకులు ఆలయం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

# బెంగాల్ పర్యటనలో కేంద్రమంత్రి గడ్కరీకి అస్వస్థత




(మొదట పేజీ తరువాయి) ఆయన ఆరోగ్యం క్షీణించింది. పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురిలో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రసంగించారు. స్టేజ్‌పై ఉండగానే షుగర్ లెవెల్ పడిపోవడంతో అకస్మాత్తుగా ఆయన ఆరోగ్యం క్షీణించింది. అనంతరం ఆసుపత్రి నుంచి వైద్యుల బృందం ఘటనాస్థలికి చేరుకుని కేంద్ర మంత్రికి ప్రథమ చికిత్స అందించారు. గడ్కరీ ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని మోదీ, బెంగల్ సీఎం మమత ఆరా తీశారు. వైద్యులకు ఫోన్ చేశారు. వైద్యం అదిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పరిస్థితిని చక్కదిద్దాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అధికారులను ఆదేశించారు. అనంతరం నితిన్ గడ్కరీని వేదిక నుంచి బయటకు తీసుకెళ్లారు. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం.. బర్సానాలోని రాజు బిష్త్ నివాసానికి వెళ్లి విశ్రాంతి తీసుకున్నట్లుగా తెలుస్తోంది. కేంద్రమంత్రికి మతిగర నివాసంలో చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అతనితో పాటు ఒక వైద్యుడు కూడా ఉన్నారు. నితిన్ గడ్కరీ సిలిగురిలోని శివ మందిర్ నుంచి సేవక్ కంటోన్మెంట్ వరకు రహదారికి శంకుస్థాపన చేయడానికి వెళ్లారు. డార్జిలింగ్ జంక్షన్ సమీపంలోని దగాపూర్ మైదానంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదికపైనే కేంద్ర మంత్రి అస్వస్థతకు గురికావడంతో వెంటనే కార్యక్రమాన్ని నిలిపివేశారు. సిలిగురిలో వేడుక ముగిసిన తర్వాత నితిన్ గడ్కరీని దల్ఖోలాకు తీసుకెళ్లాల్సి ఉంది. అంతకుముందు రోజు, నితిన్ గడ్కరీ ఒక హైవేని ప్రారంభించారు. ఇది ఢిల్లీ నుండి బీహార్ మధ్య ప్రయాణ సమయాన్ని కనీసం 10-15 గంటలు తగ్గిస్తుంది. 92 కిలోమీటర్ల పొడవైన 4-లేన్ హైవే ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే ద్వారా దక్షిణ బీహార్‌ను దేశ రాజధాని ఢిల్లీకి కలుపుతుంది. ఈ సందర్భంగా నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.. ఢిల్లీ చేరుకోవడానికి పట్టే సమయాన్ని 15 గంటల నుంచి 10 గంటలకు తగ్గిస్తున్నట్లు తెలిపారు. దీంతో బీహార్ నుంచి లక్నో మీదుగా ఢిల్లీకి చేరుకోవడం సులువవుతుంది. ఈమేరకు సోమవారం బక్సర్‌లో రూ.3,390 కోట్ల విలువైన రెండు జాతీయ రహదారుల ప్రాజెక్టులను గడ్కరీ ప్రారంభించారు. షుగల్ లెవెల్స్ పడిపోయాయని అందుకే ఆయన అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు. గడ్కరీ ఆరోగ్యంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాకబు చేశారు. ఫోన్ చేసి వివరాలు కనుక్కున్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా గడ్కరీ ఆరోగ్యంపై ఆరా తీశారు. సిలిగురిలో 1206 కోట్ల రూపాయలతో చేపట్టే జాతీయ రహదారుల ప్రాజెక్టులకు గడ్కరీ శంకుస్థాపన చేశారు. తీస్తా నదిపై 1100 కోట్ల రూపాయలతో త్వరలో వంతెన నిర్మిస్తామని కూడా గడ్కరీ హామీ ఇచ్చారు. రహదారుల నిర్మాణం కారణంగా సిక్కిం, డార్జిలింగ్, భూటాన్‌లకు కనెక్టివిటీ పెరుగుతుందని, ఈ ప్రాంతంలో మరింత అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని గడ్కరీ చెప్పారు.

# పాడైన రోడ్లకు ఎప్పటికప్పుడు మరమ్మత్తులు



(మొదట పేజీ తరువాయి) సభర్వాల్, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావు, సంజీవరావు, ఆర్ అండ్ సెక్రటరీ శ్రీనివాసరాజు, రవీందర్ రావు, ఫైనాన్స్ సెక్రటరీ రోనాల్డ్ రాస్, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే ఏడాది జనవరి 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించ నున్నారు. ఈ కార్యక్రమాన్ని మళ్లీ నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. కంటి వెలుగు కార్యక్రమం అమలు తీరుపై సీఎం కేసీఆర్ ఇవాళ సమీక్షించారు. ప్రజారోగ్యంపై వైద్య ఆరోగ్య శాఖ, ఇతర మంత్రులతో కేసీఆర్ సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు కార్యక్రమం మళ్లీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. కంటి వెలుగు పథకాన్ని 2018, ఆగస్టు 15న మెదక్ జిల్లా మల్కాపూర్‌లో సీఎం కేసీఆర్ ప్రారంభించిన విషయం విదితమే. అయితే.. ఈ పథకం ఐదు నెలల పాటు కొనసాగింది. కంటి వెలుగు కోసం ప్రభుత్వం రూ.106 కోట్లు ఖర్చు చేసింది కూడా. అయితే.. పథకంలో భాగంగా కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కళ్లద్దాలతో పాటు మందులు కూడా పంపిణీ చేసింది ప్రభుత్వం. ఈ కార్యక్రమం అప్పుడు విజయవంతమైంది. తిరిగి దీనిని ప్రారంభించాలని నిర్ణయించారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన సచివాలయానికి చేరుకున్నారు. సచివాలయ నిర్మాణ పనుల పురోగతిని కేసీఆర్ పరిశీలించారు. సీఎం కేసీఆర్ వెంట రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో పాటు తదితరులు ఉన్నారు. సచివాలయ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. ఇంటీరియర్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మూడు షిఫ్టుల్లో పనులు జరుగుతున్నాయి. కొత్త సచివాలయం ప్రాంగణానికి కేసీఆర్ చేరుకుని పనులను పరిశీలిస్తున్నారు. 150-200 ఏండ్ల వరకు చెక్కుచెదరకుండా ఉండేలా సెక్రటేరియట్‌ను నిర్మిస్తున్నారు. దీనికోసం అధికారులు, నిర్మాణ సంస్థ ప్రత్యేక దృష్టి సారించాయి. చాంబర్ల నిర్మాణం, ఇంటీరియర్ డిజైన్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వర్క్‌స్టేషన్ ఏర్పాటు, కలరింగ్, ఎలోరింగ్, మార్బుల్స్, పోర్టికోల నిర్మాణం.. ఇలా వివిధ రకాల పనులన్నీ ఏకకాలంలో చేపడుతున్నారు. రూ.617 కోట్లతో నిర్మితమవుతున్న నూతన సచివాలయ భవనాన్ని గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ పద్ధతిలో నిర్మిస్తున్నారు. నూతన సచివాలయ భవనంలోకి సహజమైన గాలి, వెలుతురు వచ్చేలా నిర్మిస్తున్నారు.

# శబరిమల ఆలయం తెరుచుకోవడంతో భక్తుల రాక



(మొదట పేజీ తరువాయి) రాజీవరు సమక్షంలో పదవీ విరమణ చేసిన మేల్శాంతి పరమేశ్వరన్ నంపూతిరి మండలపూజ చేసి గర్భగుడిని ప్రారంభించారు. ట్రావెన్ కోర్ దేవస్వం బోర్డు అధ్యక్షుడు కె.అనంతగోపాలన్, సభ్యుడు పి.ఎం.తంకప్పన్, కార్యనిర్వహణాధికారి కృష్ణకుమార్ ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. డిసెంబర్ 27 వరకు మండల పూజ కొనసాగనుంది. గత రెండేళ్ళుగా పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించిన శబరిమల ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు.. ఈ యేడాది అన్ని కోవిడ్ ఆంక్షలను పూర్తిగా తొలగించింది. అయితే, భారీ వర్షాల నేపథ్యంలో కేరళ ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శబరిమల ఆలయానికి భక్తుల ప్రవేశంపై కొన్ని ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భారీ వర్షాల నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పంబా నది భారీగా ప్రవహిస్తుండటంతో ఈ ప్రాంతంలో అలర్ట్ జారీ చేసింది. కొన్ని మార్గాల్లో ప్రవేశంపై నిషేధం విధించింది. మరిన్ని వివరాల కోసం.. వెబ్‌సైట్ చూడాలని సూచించింది. నిజానికి కరోనా ఆంక్షల కారణంగా దాదాపు రెండేండ్ల పాటు ఆలయం పూర్తిస్థాయిలో తెరుచుకోలేదు. ఇప్పుడు ఆలయం పూర్తిస్థాయిలో తెరుచుకోవడంతో మకరవిళక్కు సందర్భంగా మొదటిరోజే భారీ సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి వచ్చారు. వర్చువల్ క్యూసిస్టమ్ రిజిస్ట్రేన్ల ప్రకారం దాదాపు 49 వేల మంది భక్తులు శబరిమలకు వస్తారని అంచనా వేస్తున్నారు. ఆలయ గర్భగుడిని బుధవారం సాయంత్రం 5 గంటలకు ప్రధాన అర్చకుడు అయిన తంత్రి కందరారు రాజీవరు సమక్షంలో ప్రధాన అర్చకుడు ఎన్.పరమేశ్వరన్ నంబూతిరి తెరిచారు. 41 రోజులు జరిగే మండల పూజా ఉత్సవాలు డిసెంబర్ 27న ముగియనున్నాయి. ఈ ఏడాది భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు, ఆరోగ్య, రవాణా శాఖలతో పాటు స్థానిక అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పథనంతిట్ట జనరల్ హాస్పిటల్‌లో 24 గంటలూ శబరిమల వార్డు అందుబాటులో ఉంటుందని, దీంతో పాటు అన్ని సౌకర్యాలతో 18 బెడ్లను ఏర్పాటు చేశామని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇక్కడ అన్ని మందులు, టెస్టులు ఫ్రీగా చేస్తామని వెల్లడించింది. చెస్ట్ పెయిన్, గుండె పోటు వచ్చిన భక్తులకు 5 నిమిషాల్లో హెల్త్ వర్కర్లు ట్రీట్‌మెంట్ చేసి, హాస్పిటల్‌కు తరలిస్తారని పేర్కొంది. వయసు పైబడిన భక్తులకు కొండపైకి ఎక్కడానికి సాయం చేసేందుకు హెల్త్ వర్కర్లు అందుబాటులో ఉంటారని చెప్పింది. యాత్రా మార్గంలో రోడ్డు ప్రమాదాలను నివారణ, అత్యవసర పరిస్థితుల్లో సాయానికి సేఫ్ జోన్ ప్రాజెక్ట్‌తో మోటార్ వెహికల్స్ డిపార్ట్ మెంట్ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా 24 గంటలూ యాత్ర మార్గంలో మానిటరింగ్ ఉంటుందని, అంబులెన్స్‌లు, క్రేయిన్లు, క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను కూడా నియమించినట్లు రాష్ట్ర రవాణా మంత్రి ఆంటోని రాజు తెలిపారు. 13 వేల మంది పోలీసులతో బందోబస్తు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

జనం కోసం - మన అక్షరం
అక్షర వెలుగు
www.aksharavelugu.com
తెలుగు దిన పత్రిక




# చలన చిత్రం

## జస్వంత్‌సింగ్ బయోపిక్‌లో అక్షయ్ కుమార్



సక్సెస్, ఫెయిల్యూర్స్‌తో సంబంధం లేకుండా చకచకా సినిమాలు చేసేస్తున్నాడు అక్షయ్ కుమార్. ఇటీవల 'రామసేతు'తో ప్రేక్షకుల ముందుకొచ్చిన అక్షయ్, మరో రియల్ లైఫ్ స్టోరీలో నటిస్తున్నాడు. జశ్వంత్ సింగ్ గిల్ అనే మైనింగ్ ఇంజినీర్ బయోపిక్ ఇది. 1989లో పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్ బొగ్గు గని వరదల్లో చిక్కుకున్న అరవై నాలుగు మంది కార్మికులను రక్షించి రియల్ లైఫ్ హీరో అయ్యారు జస్వంత్. ఇది జరిగి 33 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఆయన సేవలను కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సోషల్ మీడియాలో గుర్తు చేశారు. జోషి పోస్టుకు స్పందించిన అక్షయ్.. ఈ సినిమా డిటైల్స్ చెప్పాడు. మనదేశపు మొట్టమొదటి 'బొగ్గు గని రెస్క్యూ మిషన్ ఇదని, గిల్ పాత్ర పోషించడం గర్వంగా ఉందని చెప్పాడు. 'క్యాప్సుల్ గిల్' పేరుతో రూపొందుతోన్న ఈ మూవీని పూజా ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తోంది. అక్షయ్‌తో 'రుస్తుం' లాంటి నేషనల్ అవార్డ్ విన్నింగ్ మూవీ తీసిన టిను సురేష్ దేశాయ్ దర్శకత్వం వహిస్తున్నాడు. వచ్చే ఏడాది విడుదల కానుంది.

## పెళ్లయినా తగ్గని కత్రినా క్రేజ్



బాలీవుడ్ ముద్దుగుమ్మ కత్రీనా కైఫ్ హీరోయిన్‌గా సుదీర్ఘ కాలంగా కొనసాగుతూ వస్తోంది. దాదాపుగా రెండు దశాబ్దాలుగా ఈ అమ్మడి కెరీర్ బాలీవుడ్ లో సాగుతోంది. మధ్యలో టాలీవుడ్‌లో కూడా ఈ అమ్మడు సినిమాలు చేసిన విషయం తెల్సిందే. సాధారణంగా సౌత్ హీరోయిన్స్ దశాబ్ద కాలం కంటే ఎక్కువ కెరీర్ ను కొనసాగించలేరు. ఒక వేళ కొనసాగినా కూడా ప్రస్తుతం శ్రియ ఎలా అయితే సినిమాలు చేస్తుందో అలాగే చేసుకోవాల్సి ఉంటుంది. సౌత్ లో పరిస్థితి ఇలా ఉంటే బాలీవుడ్ లో మాత్రం పరిస్థితి మరోలా ఉంది. ఇండస్ట్రీలో హీరోయిన్స్ ఎంత సీనియర్స్ అయితే అంతగా క్రేజ్ పెరుగుతోంది. కత్రీనా కైఫ్ ఇండస్ట్రీ లో అడుగు పెట్టి ఇరవై ఏళ్లు అయినా కూడా క్రేజ్ తగ్గలేదు.. క్రేజ్ కు తగ్గట్లుగా పారితోషికం ను కూడా అందుకుంటుంది. తాజాగా ఈ అమ్మడు అందుకున్న పారితోషికం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బాలీవుడ్ లో అతి తక్కువ మంది ముద్దుగుమ్మలు మాత్రమే పది కోట్లు అంతకు మించి పారితోషికం తీసుకుంటూ ఉంటారు. ఇప్పుడు కత్రీనా కూడా ఆ జాబితాలో చేరి పోయింది. కత్రీనా పెళ్ల చేసుకున్న తర్వాత కూడా క్రేజ్ తగ్గలేదు. ఏకంగా రూ.12 కోట్ల ను కత్రీనా ఒక్కో సినిమాకు తీసుకుంటుందని సమాచారం అందుతోంది. బాలీవుడ్ లో ఈ మధ్య కాలంలో సక్సెస్ లు చాలా తక్కువ అయ్యాయి. హిందీ సినిమాల యొక్క బ్జడెట్ గతంతో పోల్చితే ఈ మధ్య కాలంలో చాలా వరకు తగ్గింది. అయినా కూడా కత్రీనా పారితోషికం చూస్తూ ఉంటే ఆశ్చర్యంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో కత్రీనా యొక్క పారితోషికం గురించి ప్రముఖంగా వార్తలు వస్తున్నాయి. కత్రీనా కంటే ఎక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటున్న వారు దీపిక పదుకునే మరియు ఆలియా భట్ గా బాలీవుడ్ కు చెందిన ఒక ప్రముఖ మీడియా సంస్థ పేర్కొంది. ఇటీవల ఒక సినిమాకు ఐశ్వర్య రాయ్ పది కోట్ల రూపాయల పారితోషికం తీసుకుందట. మిగిలిన వారు మూడు నుండి అయిదు ఆరు కోట్ల పారితోషికం తీసుకుంటూ ఉన్నారట

## వరుణ్‌తేజ్ సరసన మానుషి చిల్లర్

2017లో మిస్ వరల్డ్ టైటిల్ కైవసం చేసుకున్న మానుషి చిల్లర్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోందనే ప్రచారం సాగుతోంది. 'సామ్రాట్ పృథ్వీరాజ్' సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ



ఇచ్చిన మానుషి.. తెలుగు సినిమాలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. వరుణ్ తేజ్ హీరోగా శక్తి ప్రతాప్ సింగ్ రూపొందించనున్న చిత్రంలో హీరోయిన్‌గా ఆమెను ఫిక్స్ చేసినట్టు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది. వరుణ్ తేజ్ పదమూడో చిత్రంగా తెరకెక్కనున్న ఈ మూవీ షూటింగ్ డిసెంబర్ నుంచి స్టార్ట్ కానుంది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ బ్యాక్‌డ్రాప్‌లో, రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా తెరకెక్కించబోతున్నారు. ఇందులో వరుణ్ ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా నటిస్తున్నాడు. సోని పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ సంస్థ ప్యాన్ ఇండియా మూవీగా నిర్మిస్తోంది. ఇదిలా ఉంటే.. మానుషి ప్రస్తుతం ద గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ, తెహ్రాన్ అనే మరో రెండు హిందీ చిత్రాల్లో నటిస్తోంది.



## ధమ్‌కీ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల



టాలీవుడ్ హీరో విశ్వక్ సేన్ అందరికీ ధమ్÷-కీ ఇస్తానంటోన్న విషయం తెలిసిందే. స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తోన్న ధమ్‌కీ నుంచి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ వదిలి.. మూవీ లవర్స్ ను ఖుషీ చేస్తున్నాడు. విశ్వక్ సేన్ గోల్డెన్ కలర్ వాచ్ పెట్టుకుని.. కనుబొమ్మలను ఎగరేస్తూ.. కొంచెం స్టైలిష్‌గా, కొంచెం సీరియస్‌గా చూస్తున్న ఫస్ట్ లుక్ పోస్టర్ అందరిలో సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. హెచ్చరికలు లేవు.. ధమ్‌కీ మాత్రమే.. ఫిబ్రవరి 2023న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది..అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విశ్వక్ సేన్ షేర్ చేసుకున్నాడు. ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట్లో ట్రెండింగ్ అవుతోంది. పాన్ ఇండియా కథాంశంతో తెరకెక్కుతున్న ఈ మూవీలో నివేదా పేతురాజ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ధమ్‌కీ చిత్రంలో రావు రమేశ్, పృథ్వీరాజ్, హైపర్ ఆది కీ రోల్స్ పోషిస్తున్నారు. లియోన్ జేమ్స్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని వన్మయి క్రియేషన్స్, విశ్వక్ సేన్ సినిమాస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. కామెడీ థ్రిల్లర్ జోనర్‌లో వస్తున్న ఈ చిత్రానికి ప్రసన్నకుమార్ బెజవాడ కథనందిస్తున్నాడు. ఈ చిత్రంలో పాపులర్ సింగర్ నకాశ్ అజీజ్ ఓ పాట పాడారని.. విశ్వక్ సేన్ అప్‌డేట్ ఇచ్చాడు.

## శంకర్ సినిమా కోసం కొత్త లుక్‌లో రామ్‌చరణ్

రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా శంకర్ ఓ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఓపెనింగ్ రోజు నుండే ఈ సినిమాపై భారీఅంచనాలు ఉన్నాయి. షూటింగ్ జరుగుతున్న కొద్దీ ఆ అంచనాలు మరిన్ని పెరుగుతూ వస్తున్నాయి. దానికి శంకర్, చరణ్, కియారాలతో పాటు ఎస్.జె.సూర్య, అంజలి, నవీన్ చంద్ర, సముద్రఖని లాంటి క్రేజీ కాంబినేషనే కారణం. శంకర్ సినిమాల్లోని సాంగ్స్ ఎంత రిచ్‌గా ఉంటాయో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. నిర్మాత దిల్ రాజు కూడా బడ్జెట్ విషయంలో ఏమాత్రం రాజీపడడం లేదట. తాజాగా ఒక సాంగ్ కోసం దాదాపు పదిహేను కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ పాటను పన్నెండు రోజులపాటు న్యూజిలాండ్‌లో షూట్ చేయనున్నారు. సౌత్ ఇండియాలోనే అత్యంత ఖరీదైన పాటగా ఇది నిలువనుందట. శంకర్ తన సినిమాల్లోని పాటలను ప్రేక్షకులు పదేపదే చూసేలా విజువల్ వండర్‌గా తెరకెక్కిస్తారు. ఈ పాట విషయంలోనూ ఆయన అదే చేస్తున్నట్టు అర్థమవుతోంది. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ చిత్రంలో చరణ్ డ్యూయెల్ రోల్ చేస్తున్నాడు. తమన్ సంగీతం అందిస్తున్నాడు. ఇంకా టైటిల్ కూడా ప్రకటించకపోవడంతో రోజుకో పేరు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇకపోతే ఎప్పుడూ ఇన్‌డోర్ జిమ్‌లో వర్కవుట్స్ చేసే చరణ్ ఇపుడు మాత్రం అవుట్ డోర్ సెషన్ పెట్టుకున్నాడు. ప్రస్తుతం ఈ స్టార్ హీరో శంకర్ డైరెక్షన్‌లో నటిస్తున్న చిత్రం ఆర్‌సీ 15 . పొలిటికల్ థ్రిల్లర్ వస్తున్న ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. న్యూజిలాండ్ షెడ్యూల్‌కు రెడీ అవుతోంది ఆర్‌సీ 15 టీం. రాంచరణ్ షెడ్యూల్ షురూ అయ్యే కంటే ముందు నయా జిమ్‌లో చల్లగాలిని ఆస్వాదిస్తూ వర్కవుట్స్ చేస్తున్నాడు.

## లవర్స్ ఒకరి ఫోన్లు ఒకరు మార్చుకుంటే..

### కొత్త కథాంశంగా లవ్‌టుడే మూవీ

ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'లవ్ టుడే' టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ఇదే టైటిల్‌తో తెలుగులో కూడా విడుదల చేస్తున్నారు. లవ్ టుడే తెలుగు ట్రైలర్ ను మూవీ లవర్స్‌కు అందించారు. విజయ్ దేవరకొండ ట్రైలర్ ను లాంఛ్ చేశాడు. హీరోయిన్ తండ్రి సత్యరాజ్ దగ్గరకు వెళ్లిన హీరో ప్రదీప్ రంగనాథన్ తమ ప్రేమ విషయం చెబుతాడు. మీ ఇంట్లో ఒకేనా..అని సత్యరాజ్ అడిగితే.. మా ఇంట్లో ఒకే అంకుల్ నేనేం చెప్తే అది.. అంటున్నాడు హీరో ప్రదీప్ రంగనాథన్. కానీ ఈ ఇంట్లో కొంచెం కష్టం.. నేనేం చెప్తే అదే.. ఒకే ఒక రోజు నీ ఫోన్ తను.. తన ఫోన్ నువ్వు మార్చుకుంటారు..రేపు మీరు ఒకే అనుకుంటే నాకు డబుల్ ఒకే..అంటూ ట్విస్ట్ ఇచ్చాడు సత్యరాజ్. ఈ క్రమంలో హీరోహీరోయిన్ల మధ్య ట్రాక్ ఎలా నడిచిందని కొంచెం సస్పెన్స్ లో పెడుతూ సాగుతున్న ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. లవ్ టుడే చిత్రంలో ఇవానా హీరోయిన్‌గా నటించింది. సత్యరాజ్, రాధికా శరత్ కుమార్, యోగిబాబు ప్రధాన పాత్రలు పోషించారు. ఏజీఎస్ ఎంటర్‌టైనమెంట్ బ్యానర్‌పై కల్పతి ఎస్. అఘోరం, కల్పతి ఎస్. గణెలిష్, కల్పతి ఎస్. సురేష్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా మ్యూజిక్ డైరెక్టర్.




Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com